ఇది కేవలం నీళ్లలో ఉడికించి తీసిన చాపత్తి రసం మాత్రమే కాదు... ఇది మా రక్త మాంసాలు ఉడికించి పిండిన కషాయం కూడాను... అనుకున్నాడు.

అప్పుడు రాజయ్య మనసు ఆర్ద్రమయింది. బాధ దిగడక గొంతు ఎండిపోయింది.

అప్పుడు సూర్యుడు మరింత కిందకి జారిపోయాడు.

మరో మూల నించి ఎర్రని పరదా పడమటి ఆకాశాన్ని కప్పుతోంది.

రాజయ్య కండువాలో కొత్త కరెన్సీ నోట్లు...

రాజయ్య జీప్ మీది గుర్తుకేసి చూసి, "అట్టాగే దొరా .... పెద్ద దొరకే మా ఓట్లేసి మల్లా గెలిపించుకుంటాం దొరా" అన్నాడు రాజయ్య.

రాజయ్య కోసం వాకిట్లో ఎదురుచూస్తున్న యువకులకు ఆ పూరింటిలోంచి పసిపాప ఏడుపు వినిపించింది.

వాకిట్లోంచి వెళ్ళి తలుపు దగ్గర 'చంద్రక్కా' అని పిలిచారు.

పసిపాప ఏడుపు మరింత ఎక్కువై గుక్కపడుతోంది.

ఓరగా వేసిన తలుపు నెమ్మదిగా నెట్టి చూశారు.

ఆ గదిలో ఓ మూల వెలిగి వెలిగి కుమిలిపోయిన పొయ్యి.... దాని పక్కనే చాపత్తి ఉడికించిన గిన్నె—

చంద్రక్క మంచమ్మీద పడుకుని వుంది.

రిక్తస్తనాలపై ఆ పసిపాప ఎగ్రబాకుతోంది... ఏడుస్తూ, గుక్కపెడ్తూ....

అంతా అర్థమయింది.

వాళ్ళంతా ఆవేశంతో ఆ ఇంటి మలుపు తిరిగేసరికి అక్కడ ఆ చెట్టు కింది జీప్ కదిలింది.

రాజయ్య చేతులు జోడించగా, ఆ జనం అటుకేసి నమ్రతగా చూశారు.

సూర్యుడు పూర్తిగా కిందికి జారిపోయాడు.

రెడ్డిసాబ్ వెళ్తున్న జీప్ వేగం అందుకుని ముందుకు దూసుకుపోయింది.

యువత అక్కడికి పరుగు పరుగున వచ్చేసరికే ఆ జీప్ కనుమరుగవుతోంది.

ఒక్కసారిగా వాళ్ళంతా పిడికిళ్ళు బిగించారు.

కిందికి వంగి చేతికందిన దుమ్ము తీసి అసహనంగా కనుమరుగయ్యే జీప్ మీదకు విసిరారు.

ఆ ధూళి చుట్టూ కమ్ముకుని ఒక్కసారిగా ఆకాశానికి లేచింది.

సందె చీకటి చిమ్ముకొచ్చింది.

రాజయ్య పట్టుకున్న నోట్ల కట్టల్తో నివ్వెరపోయి చూస్తున్నాడు.

అప్పుడది గోధూళి వేళ—

ఆ లేచిన పిడికిళ్ళు గోవుల గిట్టల్లా వున్నాయి.

అప్పుడు ఆ లేచిన ధూళి... గోధూళి— ★

# కోర్టు జోక్స్

## ఇద్దరు ప్రభువులు

ఐరిష్ జడ్జి ఫిట్జిబాన్ తన సీటు ప్రక్కనే పెంపుడు శునకాన్ని కూర్చోబెట్టుకునేవాడు. బారిస్టర్ కుర్రన్ వాదిస్తుంటే ఆ ప్రబుద్ధుడు శ్రద్ధగా వినకపోగా, మధ్యలో కుక్కతో ముద్దు ముచ్చట్లు సాగించాడు. వెంటనే కుర్రన్ ఆగిపోయాడు. జడ్జి కుర్రన్ వైపు తిరిగి, "చెప్పండి. గో ఆన్ మిస్టర్ కుర్రన్" అన్నాడు.

"ఆ! ప్రభువులిద్దరూ ఏదో సంప్రదించుకుంటున్నారు అనుకున్నాను" అని మెత్తగా మాడు పగిలేలా జవాబిచ్చాడు కుర్రన్.

## అసలు శిక్ష

లార్డ్ చీఫ్ జస్టిస్ రస్సెల్ ప్లీడరుగా ప్రాక్టీసు చేసే రోజుల్లో ఒక కుర్ర బారిస్టర్ సలహా అడిగాడు— "ఏమండీ! ఇద్దరిని పెండ్లాడిన నేరానికి (బైగమీ) ఏమాత్రం శిక్ష వుంటుంది" అని.

రస్సెల్ తపీమని జవాబిచ్చాడు — "ఇద్దరు అత్తలు" అని.

## నల్లుల సరఫరా

ఒక ప్లీడరు వాదిస్తూ, లా పుస్తకం జడ్జిగారు చూడడం కోసం వారికి అందజేశాడు. బుక్కు తెరిచేసరికి అందులో ఒక నల్లి వుంది.

"బెంచికి ఒక నల్లిని కూడా పంపావు" అని జడ్జి ఎకసెక్కమాడాడు.

"మిలార్డ్! ఇదే మొదటి దఫా కాదండీ. ఈవైపు నుంచి ఆ వైపుకి లోగడ చాలా నల్లులను పంపాం" అని మాటకు మాట అంటించాడు ఆ ప్లీడరు.

## ముసలి తీర్పు

హైకోర్టులో ఒక ప్లీడరు ఎనభై ఏళ్ళ నాటి తీర్పు కోట్ చేస్తే, ఎదిరి ప్లీడరు నవ్వేసి, "మైలార్డ్! ఆ రూలింగ్ పాత చింతకాయ, హిమాలయాలంత పురాతనమైనది" అని తేలికగా అన్నాడట.

అప్పుడీ ప్లీడరు చాకచక్యంగా "అయ్యా! తమరు ముసలివారు, నేను ముసలివాణ్ణి, అవతల ప్లీడరు మరీ వృద్ధుడు— అంతమాత్రాన మనం పనికిరాకుండా పోతామంటండీ?" అనేసరికి అందరూ నవ్వారట.

## జడ్జిలా

మద్రాసు హైకోర్టులో పూర్వం హాస్యప్రియుడుగా ప్రసిద్ధి చెందిన వార్డన్ ఒక బెంచి ముందు వాదిస్తున్నాడు. సీనియర్ జడ్జి సర్ జాన్ వాలిస్ కునుకుతీస్తున్నాడు. డఫేదార్ కూడా చతికిలబడి దయామకు ఆనుకొని నిద్రపోతున్నాడు. వార్డన్‌కు ఒళ్ళు మండి పుస్తకాల కుప్ప ఒక్కమాటుగా క్రిందికి నెట్టాడు. పెద్ద చప్పుడు అయింది. జడ్జి ఉలిక్కిపడి లేచి, "మిస్టర్ వార్డన్! ఏం జరిగింది?" అని అడిగాడు.

"ఏమీ లేదు మిలార్డ్! ఈ డఫేదార్ పొగరు చూడండి. పబ్లిక్ కోర్టులో నిద్రోతున్నాడు పెద్ద జడ్జి లాగా" అని చురక వేశాడు వార్డన్.

## చేతికి అందినవన్నీ తీసుకుంటాడు

జస్టిస్ ఒడ్జర్సుకు హిందూ న్యాయశాస్త్రంలో లోతుపాతులు తెలియవు. ఆర్గ్యూ చేస్తున్నటి. రామచంద్ర అయ్యర్‌ను "మిస్టర్ అయ్యర్! హిందూ లా ప్రకారం అల్లుడేమి తీసుకుంటాడు?" అని అడిగాడు.

"చేతికందినవన్నీ!" అని అయ్యర్ జోక్ విసిరాడు.

## న్యూసెన్స్ ప్రాపర్టీ

ఒక బెంచి కోర్టు ప్రెసిడెంటు వుండేవాడు. ఆయనకు కోర్టు ప్రొసీజరులో మిడిమిడి జ్ఞానం వుంది. ఒక న్యూసెన్స్ కేసులో పోలీసులతో "ఈ నేరంలో కేసు— ప్రాపర్టీ ప్రొడ్యూస్ చేయలేదేమి?" అని తెలివితక్కువగా అడిగాడు. ప్లీడరు, పోలీసులు నవ్వుకున్నారు.

## గారికి పొగరు దిగింది

మాజిస్ట్రేటు ఒక ముద్దాయిని "నీ పేరేమిటి?" అని అడిగాడు.

"నా నామధేయం మహంకాళయ్యగారు" అని గర్వంగా జవాబిచ్చాడు అతడు.

కొన్ని మాసాల తర్వాత కేసులో తీర్పు చెబుతూ— "మహంకాళయ్యకు రెండు నెలలు నెరసి వాళ్ళ నెలలు కఠిన కారాగారశిక్ష వేస్తున్నా. ముద్దాయిగారూ, తమకు జైలులో రొట్టె కావాలా, వరి అన్నం భోజనం చేస్తారా?" అని అతి మర్యాద పదాలతో తోక తెగ్గోశాడు ఆ మాజిస్ట్రేటు.

బద్దిగం పాండురంగారెడ్డి